క్లుప్తంగా

సాగు, తాగునీటిపై ప్రత్యేకంగా దృష్టి సారించండి

జేసీ సూరజ్‌కుమార్‌కు ఎమ్మెల్యే వినతి



నరసరావుపేట: సాగు, తాగునీటిపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు. జాయింట్ కలెక్టర్ సూరజ్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో అభివృద్ధి, సమస్యల గురించి చర్చించారు. ఆయన వెంట నాయకులు వాసిరెడ్డి రవి, గంగుల పెద్దిరెడ్డి ఉన్నారు.

ఏబీ కెనాల్‌కు సాగర్ జలాలు విడుదల



శావల్యాపురం: నాగార్జున సాగర్ జలశయం నిండు కుండలా మారటంతో సాగర్ జలశయం గేట్లును ఎత్తి నీటిని విడుదల చేస్తున్నట్లు లింగంగుంట్ల ఎన్నెస్పీ ఎస్ఈ దర్శికుండ వరలక్ష్మి మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా ఎస్ఈ వరలక్ష్మి మాట్లాడుతూ ఆయకట్టు సాగుతకు నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు. నాగార్జున సాగర్ జలశయం పరిధిలో ఆయుకట్టు 6 లక్షల 74 వేల సాగు భూమి ఉందని వివరించారు. పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో 27 మేజరు కాల్వలు ఉండగా 66 వేల ఎకరాలు సాగు భూమి ఉంది. ప్రస్తుతానికి అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు 1300 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈఏడాది సాగు నీరుకు ఇబ్బందులు లేదని ఎస్ఈ పేర్కొన్నారు.

హిరోషిమా ఘటన మహావిషాదం



చిలకలూరిపేటటౌన్: హిరోషిమా, నాగసాకి ఘటన ప్రపంచ చరిత్రలో విషాద ఘటన అని విశ్రాంత గ్రంథ పాలకులు టి.ప్రతాపరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఆరెంజ్ సెంటర్లోని మోడ్రన్ డిగ్రీ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో హిరోషిమా దినాన్ని మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అగ్రరాజ్యాల సామ్రాజ్య విస్తరణ కాంక్ష అణుబాంబు రూపంలో జపాన్‌లోని హిరోషిమాను బలిగొన్నదన్నారు. డాక్టర్ పీవీ సుబ్బారావు మాట్లాడుతూ హిరోషిమా, నాగసాకీలపై అమెరికా వేసిన అణుబాంబు సంఘటన ప్రపంచాన్ని కలిచి వేసిందన్నారు. కార్యక్రమంలో జేవీవీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు దార్ల బుజ్జిబాబు, జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ చుక్కా విన్సెంట్ పాల్, షేక్ చినమస్తాన్ పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సు సర్వీసు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ డిపో పరిధిలో విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజరు కోటేశ్వరరావు నాయక్ తెలిపారు. మంగళవారం చీకటీగలపాలెం మోడల్ స్కూల్ విద్యార్థులు బస్సులేక బ్బందులు పడుతున్నారని గుర్తించిన డీఎం వెంటనే ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ పాఠశాలకు పాఠశాల సమయాన్ని దృష్టిలో ఉంచుకుని బస్సు సర్వీసు నడుపుతున్నట్లు పేర్కొన్నారు.

రొంపిచర్లలో భారీ వర్షం

రొంపిచర్ల: మండల కేంద్రం రొంపిచర్ల పరిసర ప్రాంతాల్లో మంగళవారం భారీ వర్షాలు కురిశాయి. మండల కేంద్రమైన రొంపిచర్లలో మంగళవారం ఉదయానికి 47.6 ఎం.ఎం. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. అయితే నరసరావుపేట డివిజన్‌లోని రొంపిచర్లలో ఎక్కువ వర్షపాతం నమోదైంది. డివిజన్‌లోని చిలకలూరిపేటలో 3.2 ఎం.ఎం వర్షపాతం నమోదు కాగా ఈపూరులో 18.6, యడ్లపాడులో 9.8, నరసరావుపేటలో 37.6, నాదెండ్ల 9.2, నూజెండ్ల 14.2, శావల్యాపురం 13.6, వినుకొండ 10.2 అలాగే బొల్లాపల్లి 25.8 ఎం.ఎం వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

సార్ ఎప్పుడొస్తారో..

బొల్లాపల్లి: మండలానికి రెగ్యులర్ తహసీల్దార్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెవెన్యూ సేవలు అందకపోవడంతో అవస్థలు పడుతున్నామని, కుల, ఆదాయ, నివాస, ఫ్యామిలీ మెంబర్ తదితర ధ్రువీకరణ పత్రాల సేవలు నేటికి అందుబాటులోకి రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం ఎన్నికల విధులు నిర్వహించిన తహసీల్దార్ బదిలీ కావడంతో సీఎస్‌డీటీ విద్యాసాగర్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. అయితే సీఎస్‌డీటీ కేవలం పౌరసరఫరాల సేవలకే పరిమితమయ్యారని, తహసీల్దార్ ఇన్‌చార్జి బాధ్యతలు పక్కన పెట్టారని, దీంతో ప్రజలకు రావాల్సిన పలు సేవలు నిలిచిపోయాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నరసరావుపేట రైల్వేస్టేషన్‌కు దారేది!

- పడమర వైపు దారికి అడ్డుగా స్లీపర్లు
- ఇబ్బందిపడుతున్న ప్రయాణికులు
- అభివృద్ధి పనుల కోసమంటున్న ఆర్‌పీఎఫ్ అధికారులు



పడమర వైపు ఉన్న మార్గంలో అడ్డుగా ఉంచిన స్లీపర్లు

నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని రైల్వేస్టేషన్‌కు ప్రయాణికుల రాకపోకలు సాగించే రెండు మార్గాల్లో ఒకటైన పడమర వైపున ఉన్న మార్గాన్ని నియంత్రిస్తూ ఆర్‌పీఎఫ్ అధికారులు ఆ మార్గానికి అడ్డుగా రైల్వే స్లీపర్లు ఏర్పాటు చేశారు. దీంతో 20 రోజుల నుంచి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నరసరావుపేట మండలం, రొంపిచర్ల వైపున ఉన్న పలు గ్రామాలకు చెందిన వారితో పాటు జిల్లా కలెక్టరేట్, లింగంగుంట్ల కాలనీ, నవోదయనగర్, రామిరెడ్డిపేట ప్రాంతాల నుంచి వందలాది మంది ఈ మార్గం గుండా రైల్వేస్టేషన్‌కు వచ్చి వెళ్లేందుకు ఈ మార్గం అనువుగా ఉంది. లేనిపక్షంలో చుట్టూ తిరిగి మొదటి రైల్వేగేటు వద్దనున్న ఏకైక మార్గం నుంచే రాకపోకలు సాగించాల్సిఉంది. ప్రతి రైల్వేస్టేషన్‌కు ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు ఇన్ అండ్ అవుట్ అనే రెండు మార్గాలను ఏర్పాటు చేస్తారు.

సుమారు 20 ఏళ్ల క్రితం పై ప్రాంతాలకు చెందిన వారు స్టేషన్‌లోకి సులభంగా వచ్చేందుకు, రైలు దిగిన ప్రయాణికులు వెళ్లేందుకు మున్సిపల్, రైల్వేశాఖలు సంయుక్తంగా ఈ మార్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ స్లీపర్లు ఏర్పాటు చేయటం వలన ద్విచక్ర, నాలుగుచక్రాల వాహనాలు పూర్తిగా నిల్చిపోయాయి. ప్రయాణికులు రావాలంటే స్లీపర్లను దాటుకుంటూ రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. వికలాంగులు, అనారోగ్యంతో ఉన్నవారు వచ్చేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే అడ్డుగా ఉన్న స్లీపర్లను తొలగించాలని కోరుతున్నారు.

అధికారులు ఏమన్నారంటే..

ఆర్‌పీఎఫ్ సీఐ రవీంద్రను వివరణ కోరగా స్టేషన్‌లో అభివృద్ధి పనులు చేపట్టిన దృష్ట్యా ఆటంకం కలుగకుండా ఉండేందుకు వాహనాలు రాకుండా స్లీపర్లు అడ్డుగా వేశామన్నారు. త్వరలో పడమర వైపు కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల రోడ్డు నుంచి లోపలికి ప్రవేశించేందుకు అనువుగా ప్రవేశద్వారం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. దీనికోసం ప్లాన్‌కూడా సిద్ధమైందన్నారు. అయితే ఎంతకాలంలో చేస్తారో చెప్పలేమని అన్నారు.

ప్రజల సహకారంతో 'స్వచ్ఛ నరసరావుపేట'

ఎమ్మెల్యే అరవిందబాబు



వార్డులో బురద మడుగును శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట: ప్రజల సహకారంతోనే పట్టణాన్ని స్వచ్ఛ నరసరావుపేటగా తీర్చిదిద్దుకోగలమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. పట్టణంలోని 15,17,22, 31వ వార్డుల్లో మంగళవారం నిర్వహించిన పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. కాల్వల్లో పార ద్వారా పూడికతీత పనులు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా ప్రతి వార్డులో పూర్తి స్థాయిలో కాలువల్లో పూడికను తొలగించనున్నట్లు చెప్పారు. పిచ్చి మొక్కలు తొలగించడం, రోడ్డుకు ఇరువైపులా ఉన్నటువంటి బిల్డింగ్ మెటీరియల్స్ దిబ్బలు తొలగించాలని కోరారు. దోమలను నియంత్రించేందుకు ఫాగింగ్, యాంటీ లార్వా స్ప్రేయింగ్ ద్వారా పూర్తిస్థాయిలో నిర్మూలన పనులు జరుగుతున్నాయని వివరించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రరెడ్డి పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మించాలి..

నరసరావుపేట: పట్టణ శివారు వల్లప్పచెరువు వద్దను న్న రెండు చప్టాల మధ్య అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని పట్టణ వినియోగదారుల సంక్షేమ సంఘ నాయకులు విన్నవించారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు సమస్య వివరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పట్టణ ఉపాధ్యక్షుడు కుంచాల స్వామి, శ్రీనివాసరావు, శంకరరావు, గురుస్వామి, రామిరెడ్డి పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలి

స్థానిక ప్రకాష్‌నగర్‌లోని బాపనయ్యనగర్‌లో ఏళ్ల తరబడి గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న వారికి పట్టాలు ఇవ్వాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును మాలమహానాడు నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం వార్డు పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యేకు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదాజాన్‌పాల్, గుడిసెవాసులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ వెంకటరావు, కుంభ బ్రహ్మయ్య, గోదా నీలాంబరం పాల్గొన్నారు.

సెప్టెంబర్ 15లోగా ఈ-పంట నమోదు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంఏఓ శ్రీలత

యడ్లపాడు: ఈ-పంట నమోదు ప్రక్రియను సెప్టెంబర్ 15వ తేదీలోగా పూర్తి చేయాలని మండల వ్యవసాయ అధికారి సీహెచ్ సరిత చెప్పారు. యడ్లపాడు మండల వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం రైతులు, రైతు సేవా కేంద్రాల సిబ్బందికి సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2005 సమాచార హక్కు చట్టం కింద పౌరులందరికీ అన్ని రకాల సమాచారాలను పొందే హక్కు ఉందన్నారు. అలాగే వాస్తవ సాగుదారులకు మాత్రమే ఈ-పంట నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

చిలకలూరిపేట: సమాచారహక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి టి.శ్రీలత చెప్పారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో వ్యవసాయ సహాయకులు, రైతులకు సమాచార హక్కు చట్టం 2005పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సమాచార హక్కు చట్టంపై అవగాహన లేక తమ హక్కులు కోల్పోతున్నారని వెల్లడించారు. సమాచార హక్కు చట్టం గురించి అవగాహన కల్పించటంతో పాటు అధికారుల విధుల గురించి వివరించారు. ఈ-పంట యొక్క ఆవశ్యకతను గురించి, పత్తిలో రసం పీల్చే పురుగుల నివారణ గురించి తీసుకోవాల్సిన చర్యలను అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ జీపీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పలువురికి వైద్య పరికరాలు అందజేత



లబ్ధిదారులకు పరికరాలు అందజేస్తున్న సర్పంచి చెన్నమ్మ

శావల్యాపురం: స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో అర్హత కలిగిన లబ్ధిదారులకు మంగళవారం చేతికర్రలు, నడుంబెల్ట్‌లు, టాయిలెట్ చైర్స్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా సర్పంచి యాగసిరి చెన్నమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం నడవలేని వారికి, మంచానికి పరిమితమైన వారికి, నడుం నొప్పితో బాధపడే వారందరికి ఉచితంగా ఇలాంటి మంచి కార్యక్రమాలు చేపట్టటం అభినందనీయమన్నారు. శావల్యాపురం గ్రామంలో చేతి కర్రలు-37, నడుంబెల్ట్‌లు-20, టాయిలెట్స్ చైర్స్-07 మంది లబ్ధిదారులకు అందజేశామన్నారు. మండలంలోని 15 గ్రామపంచాయతీలో నడుంబెల్ట్‌లు-131, చేతి కర్రలు-214, టాయిలెట్ చైర్స్-27 మంజూరు అయినట్లు ఎంపీడీఓ కొర్రపాటి కవితాచౌదరి తెలిపారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు దూదెకుల హుస్సేన్, గ్రామ పెద్దలు చిట్టేటి రవి, పోట్లూరి ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శి కానుగంటి మహేంద్ర, మహిళా పోలీసు గౌసియాబేగం పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మలేరియా నివారణ జిల్లా అధికారి కె.రవీంద్ర రత్నాకర్



మాట్లాడుతున్న జిల్లా మలేరియా నివారణ అధికారి రవీంద్ర రత్నాకర్

శావల్యాపురం: వర్షాకాలంలో ప్రబలే అంటువ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా నివారణ జిల్లా అధికారి కె.రవీంద్ర రత్నాకర్ పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ డే మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్వరాలు, డెంగీ, చికెన్‌గున్యా, మలేరియా తదితర అంటువ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్య అధికారులు సిబ్బంది ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. మురుగుకాల్వల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకుంటే దోమల వ్యాప్తి అరికట్టవచ్చని చెప్పారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సమావేశంలో వైద్యాధికారులు మాణ్యం రాధాకృష్ణన్, రావిపూడి రమ్య, సూపర్‌వైజర్లు ఎ.ఏడుకొండలు, ఉమాదేవి, స్టాఫ్ నర్సులు బి.లక్ష్మీప్రసన్న, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో....

బొల్లాపల్లి: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని బొల్లాపల్లి పీహెచ్‌సీ వైద్యులు ఎం.సాయి వినూత్న అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంగళవారం ఆశ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ అంటువ్యాధులు ప్రభలకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఈ నెల 20న జాతీయ నులిపురుగుల కార్యక్రమాన్ని పురస్కరించుకొని అంగన్‌వాడీల్లో చిన్నారులు, పాఠశాలల్లో, కాలేజీల్లో విద్యార్థుల జాబితాను తయారు చేయాలని తెలిపారు. నులిపురుగుల నివారణలో భాగంగా ఆల్‌బెండాజోల్ పంపిణీ చేయాలని, వీటితో రక్త హీనత నివారించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యసిబ్బంది ఎన్.రవి, బి.పద్మావతి, సుమతి పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

శావల్యాపురం: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన మహిళలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎంఈఓ మద్దికుంట సాంబశివరావు తెలిపారు. మంగళవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో ఎంఈఓ విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 39 ప్రభుత్వ పాఠశాలలుగాను 2,800మంది విద్యార్థుల ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు మేరకు కమిటీ సభ్యులు ఎన్నికల పూర్తి అయిన తదపరి చైర్మన్ ,వైస్ చైర్మన్ ఎంపిక ఈనెల 8న సాయంత్రం జరుగుతుందన్నారు.

నాణ్యమైన వరి విత్తనాలు సరఫరా చేయాలి

శావల్యాపురం: సాగర్ జలాలు విడుదల చేసిన నేపథ్యంలో రైతులకు అవసరమైన నాణ్యమైన వరి విత్తనాలు సరఫరా చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కనగాల వెంకట మోహన్‌చంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రైతుల బలహీనతలను ఆసరాగా చేసుకుని కొంతమంది దళారులు విత్తన వ్యాపారులు, నకిలీ విత్తనాలు నల్లబజారులో అధిక ధరలకు అమ్ముతున్నారని ఆరోపించారు.

అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ మండలంలోని తిమ్మాయపాలెంలో అగ్నిప్రమాద బాధితులను ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మంగళవారం పరామర్శించారు. లగడపాటి సత్యం, చిన్న సుబ్బారావు, పెద్దసుబ్బారావు, గాలెయ్యల పొగాకు కొష్టాలు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారిని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన సమన్వయకర్త నాగ శ్రీను రాయల్ పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

నూజెండ్ల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ టి.వీరభద్రాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పాల్గొంటారని, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

వయనాడ్ బీభత్సాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలి

రొంపిచర్ల : కేరళ రాష్ట్రంలోని వయనాడ్ దుర్ఘటనను కేంద్రం ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలని స్థానిక భగత్ సింగ్ భవన్ నిర్వహణ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. బాధితులకు సహాయం కోసం మంగళవారం దాతల నుంచి రూ.45 వేలు విరాళాలు సేకరించి కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి బ్యాంకు ద్వారా అందజేశారు. కార్యక్రమంలో భగత్ సింగ్ భవన్ నిర్వహణ కమిటీ ముఖ్య కార్యదర్శి ఎస్.రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన బియ్యం పేరుతో రేషన్ విక్రయం

మహిళలను బురిడీ కొట్టించిన మోసగాళ్లు

నరసరావుపేట: కొందరు మోసగాళ్లు నాణ్యమైన బియ్యం పేరుతో రేషన్ బియ్యం అంటగట్టి పలువురు మహిళలను మోసం చేసిన ఘటన పట్టణంలోని 27వ వార్డు పాతూరు శివాలయం పరిసరాల్లో చోటుచేసుకుంది. మహిళలు తెలిపిన వివరాలు.. నలుగురు వ్యక్తులు ఉదయమే తమ ఇళ్లవద్దకు వచ్చి తాము రైతులమని, తమ పొలాల్లో పండిన ధాన్యం ఇళ్ల వద్దకు వచ్చి విక్రయిస్తున్నామని నమ్మబలికారు. కొంత బియ్యం ఇచ్చి వండి చూడాలని కోరారు. మహిళలు ఆ బియ్యాన్ని వండి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో ఒక మహిళ 2.5 క్వింటాళ్లు తీసుకొని రూ.10,500 చెల్లించగా మరో ఇద్దరు మహిళలు 75 కేజీల చొప్పున తీసుకని డబ్బులు చెల్లించారు. మొత్తం వారికి రూ.18 వేలు చెల్లించామని మహిళలు చెప్పారు. తీరా వారు వెళ్లిన తర్వాత బియ్యం గోతాలు కట్లు తీసి చూడగా రేషన్ బియ్యం ఉన్నాయన్నారు. మోసానికి పాల్పడిన వారిపై చర్య తీసుకోవాలని కోరారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదులు పోలీసులకు అందలేదు.

వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

- డీడీఏ ఎం.శివకుమారి
- గ్రామ విత్తనోత్పత్తి పథకంపై శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న శివకుమారి

నూజెండ్ల: వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి పేర్కొన్నారు. నూజెండ్ల మండలంలోని ములకలూరు రైతు సేవా కేంద్రంలో గ్రామ విత్తనోత్పత్తి పథకంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి నాట్లు వేసే ముందు దమ్ములో సింగిల్ సూపర్ ఫాస్పేట్ వేసుకుంటే పైరుకు పైపాటుకు వేసే కాంప్లెక్స్ ఎరువులను తగ్గించుకోవచ్చని తెలిపారు. నారు కొనలు తుంచి నాట్లు వేసుకోవడం వలన ఆకుముడత, కాండం తొలుచు పురుగు బెడద తొలగించుకోవచ్చని చెప్పారు. వరినాట్లు పూర్తయిన వెంటనే కాలిబాటలు తీసుకోవాలని తెలిపారు. దీని వలన గాలి, వెలుతురు ధారాళంగా వ్యాపించి తెగుళ్లు, పురుగులు సోకకుండా ఉంటుందన్నారు. రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖ అధికారులు సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రవిబాబు, డీఆర్‌పీ ఏఓ ప్రవీణ్, ఏఓ సుగుణాబేగం, ఏఈఓ ఎలీషా, వీఏఏలు కృష్ణారెడ్డి, వేంత్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ, అంకితభావం



సర్టిఫికెట్లు సాధించిన విద్యార్థులతో ఎన్‌సీసీ అధికారులు, ఉపాధ్యాయులు

నాదెండ్ల: విద్యార్థులు ఎన్‌సీసీతో క్రమశిక్షణ, అంకితభావం అలవర్చుకుని భావిభారత పౌరులుగా ఎదగాలని హెచ్ఎం ఐ.కృష్ణానాయక్ కోరారు. గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుంటూరు-25 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ ఎ-సర్టిఫికెట్ల కోసం పరీక్ష మంగళవారం నిర్వహించారు. 45 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా నూరు శాతం మంది ఎంపికయ్యారు. బెటాలియన్ మేజర్‌హవాల్దార్ బల్బీర్‌సింగ్, హవాల్దార్ చల్లా చిరంజీవిల పర్యవేక్షణలో విద్యార్థులకు రాత పరీక్ష, దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను స్కూల్ ఎన్‌సీసీ ఆఫీసర్ మహమ్మద్ రసూల్ అభినందించారు. ఈ సందర్భంగా కృష్ణానాయక్ మాట్లాడుతూ, పాఠశాలలో 8,9 తరగతులు చదువుతున్న విద్యార్థులు సర్టిఫికెట్లు సాధించటం అభినందనీయమన్నారు. ఎన్‌సీసీలో కొనసాగుతూ ఇంటర్‌లో బీ సర్టిఫికెట్, డిగ్రీలో సీ సర్టిఫికెట్ పొందినట్లయితే ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో కోటా వర్తిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీడీ వేణుగోపాల్, పీఈటీ జాస్తి శ్రీకాంత్ పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం



అవగాహన ర్యాలీలో నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

నాదెండ్ల: బిడ్డ జన్మించిన గంటలోపే తల్లిపాలు పట్టించినట్లయితే బిడ్డ నూరేళ్ల ఆరోగ్యకరమైన జీవితానికి అమృతం లాంటి పోషకాలు అందుతాయని హెల్త్ సూపర్‌వైజర్ రహమాన్‌బాషా చెప్పారు. గణపవరం శాంతినగర్‌లోని పదో నంబర్ అంగన్‌వాడీ సెంటర్‌లో మంగళవారం అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాలింతలు మంచి పౌష్టికాహారం తీసుకుంటూ ఉండి ఆరోగ్యకరంగా ఉండాలన్నారు. బిడ్డలకు మూడేళ్లు వచ్చే వరకూ తల్లిపాలు కొనసాగించాలన్నారు. ఆరు నెలలు నిండిన బిడ్డలకు పోషకాలతో కూడిన ఘనాహారాన్ని అలవాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి పాల్గొన్నారు.

ఐనవోలులో అవగాహన ర్యాలీ

నూజెండ్ల: మండలంలోని చింతలచెర్వు సెక్టార్ పరిధిలోని ఐనవోలు గ్రామంలో తల్లిపాలపై అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్‌కే వహిదా రజాక్ మాట్లాడు తూ పుట్టిన వెంటనే గంట లోపు ముర్రుపాలు పట్టా లని, 6 నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని తెలిపారు. తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం.నాగరాజుకుమారి, వైద్యసిబ్బంది సీహెచ్‌ఓ చరిష్మా, జ్యోతి, సురేష్, పంచాయతీ సెక్రటరీ వి.రామకృష్ణ, మహిళా పోలీస్ భార్గవి, అంగన్‌వాడీ కార్యకర్తలు బి.లక్ష్మీప్రియా, ఎం.మేరమ్మ పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు రోగ నిరోధక శక్తి

చిలకలూరిపేట: తల్లిపాలపై అవగాహన అవసరమని ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షురాలు గట్టు సరోజిని చెప్పారు. క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని లహరి ఆస్పత్రిలో తల్లిపాల వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఆస్పత్రిలోని గర్భిణులు, బాలింతలకు తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి జయలక్ష్మి, సభ్యులు టి.రమాదేవి, పి.పద్మావతి, దండా రమాదేవి, సరస్వతి, భారతి పాల్గొన్నారు.

జేజీఎల్‌తో పాటు అన్ని రకాలు సాగుచేయవచ్చు

- సహాయ వ్యవసాయ సంచాలకులు పి.మస్తానమ్మ
- విత్తనాలు షాపుల తనిఖీ



స్టేషన్‌రోడ్డులోని విత్తనాల షాపులో తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

నరసరావుపేట రూరల్: జేజీఎల్ 384 రకం వరి విత్తనం కోసం ఎదురు చూడకుండా ఇతర రకాలైన కేఎన్ఎం 733, 1638, ఎంటీయూ 1282, హెచ్ఎంటీ సోనా, ఎన్ఎల్ఆర్ 34449, బీపీటీ, ఏపీ 567, జేజీఎల్ 27356 రకాలను సాగుచేసి అధిక దిగుబడి పొందవచ్చని సహాయ వ్యవసాయ సంచాలకులు పి.మస్తానమ్మ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని స్టేషన్‌రోడ్డులోని పలు విత్తనాల షాపులను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ సాగర్ నీళ్ల విడుదలైనందున రైతులందరూ వరి సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారని చెప్పారు. పై రకాలన్నీ నరసరావుపేట విత్తన డీలర్స్ వద్ద అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అన్నీ స్వల్పకాలిక రకాలని, అగ్గితెగులు, ఇతర తెగులను కూడా తట్టుకుంటాయని వివరించారు. మార్కెట్లో కూడా అమ్ముకోవడానికి అనువైన రకాలని, రైతులందరూ సెప్టెంబర్ 15వ తేదీలోగా నాట్లు వేయగలిగితే బీపీటీ 5204 కూడా అనుకూలమైందని చెప్పారు. స్టేషన్ రోడ్‌లోని విత్తనాలు షాపులన్నీ కూడా తనిఖీ చేశామని, స్టాక్ బోర్డులో రేటు పట్టికలను ప్రతి రైతుకి అందుబాటులో ఉంచమని వ్యాపారులకు సూచించామన్నారు. జేజీఎల్ 384 అను రకాన్ని అధిక ధరలకు అమ్మినచో ఆ షాపులు లైసెన్సులు నిలుపుదల చేసి కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించామన్నారు. పైన తెలిపిన రకాలన్నీ కూడా షాపులు వద్ద రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని చెప్పారు. మండల వ్యవసాయాధికారి వి.నరేంద్రబాబు, వ్యవసాయ విస్తరణ అధికారి కె.బ్రహ్మయ్య మల్లవరపు బోసు, ఆవుల శ్రీకాంత్ రెడ్డి హాజరయ్యారు.

మొక్కల పెంపకం మనందరి బాధ్యత

చిలకలూరిపేటటౌన్: మొక్కల పెంపకం మనందరి బాధ్యతగా భావించాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు చెప్పారు. మండలలలోని వేలూరులో అటవీ యేతర ప్రాంతాల్లో మొక్కల పెంపకంపై మంగళవారం అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో అటవీయేతర ప్రాంతాల్లో ఎలాంటి మొక్కలు, ఈ విధంగా నాటాలి, అడవిజాతి మొక్కలు, ఉద్యానవన మొక్కలను వ్యవసాయ భూముల్లో ఎలా నాటితే వాటి ప్రయోజనాలు ఉంటాయనే అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ట్రీస్ అవుట్‌సైడ్ ఫారెస్ట్ ఇండియా టిఓఎఫ్ఐ ప్రోగ్రాం స్టేట్ అసోసియేట్ ప్రణీత్ వర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణకు డీఆర్డీఏ ఏపీఎం భరత్, సీసీ శివయ్య, గ్రామస్తులు కట్టా వేణుకుమార్, డి.రాజేష్, సర్పంచి బొంత తిరుపతయ్య, కార్యదర్శి రూత్‌కుమార్, ఆర్‌బీకే సహాయకులు భార్గవి పాల్గొన్నారు.